సాక్షి
ప్రకాశం

ఆదివారం । 20 । జూలై । 2025



కూటమిది అరాచక ప్రభుత్వం

రాష్ట్రంలో కూటమిది అరాచక, అవినీతి ప్రభుత్వమని మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ విమర్శించారు.

- 8లో..



సీజనల్ వ్యాధులతో చనిపోతే వైద్యులపై చర్యలు

సీజనల్ వ్యాధులతో ప్రజలు చనిపోతే వైద్యులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం 37 /28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ఆర్టీసీ బస్టాండులో అధిక ధరల విక్రయాలపై కలెక్టర్ ఆగ్రహం



బస్టాండు ఆవరణలోని స్టాల్‌లో ధరలు కనుక్కుంటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

మార్కాపురం: మార్కాపురం ఆర్టీసీ బస్టాండులో తినుబండారాలు, కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిల్స్ అధిక ధరలకు విక్రయించడంపై కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆమె మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్‌ను సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె బస్టాండు ఆవరణను తనిఖీ చేశారు. అపరిశుభ్రంగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రయాణికులకు కనీస సౌకర్యాలు లేకపోవడాన్ని గుర్తించి అసంతృప్తి వ్యక్తం చేశారు. బస్టాండు ఆవరణలో ఉన్న క్యాంటీన్ వద్దకు వెళ్లి వాటర్‌బాటిల్స్, కూల్‌డ్రింక్స్, బిస్కెట్ల ధరలను అడగ్గా ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువ చెప్పడాన్ని గమనించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పలువురు ప్రయాణికులు కూడా తమకు అధిక ధరలకు వాటర్ బాటిల్స్ విక్రయించారని ఫిర్యాదు చేశారు. ఈ విషయమై తహశీల్దార్ చిరంజీవి మాట్లాడుతూ తాను ఇటీవల తనిఖీ చేసి నోటీసులు కూడా ఇచ్చానని కలెక్టర్‌కు వివరించారు. బస్టాండు ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. మెరుగైన చర్యలు తీసుకోవాలని డీఎం నరసింహులును ఆదేశించారు. కలెక్టర్ వెంట వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఆగి సాగిన పొగాకు వేలం

- నో బిడ్‌లు అవుతున్నాయని రైతుల ఆగ్రహం
- గంట పాటు నిలిచిన వేలం ప్రక్రియ



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

టంగుటూరు: నో బిడ్‌లు అవుతున్నాయని, రోజు కంటే లోగ్రేడు పొగాకుకు రూ.30 తగ్గిస్తున్నారంటూ వేలాన్ని రైతులు అడ్డుకోగా, గంట తరువాత చర్చల అనంతరం వేలం సాగింది. టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో శనివారం వేలం ప్రక్రియ ప్రారంభమై 40 బేళ్ల కొనుగోలు చేశారు. సగానికిపైగా బేళ్లను తిరస్కరించగా మిగిలినవి లోగ్రేడుకు రూ.30 కోత పెడుతూ కొనుగోలు చేయడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వేలం ప్రక్రియ నిలిపేశారు. చర్చల అనంతరం పొగాకు బోర్డు అధికారులు, కంపెనీల బయ్యర్లు నో బిడ్‌లు జరగకుండా వేలం నిర్వహిస్తామని హామీ ఇవ్వడంతో వేలం సాగింది. అయినా చివరకు 257 బేళ్లను వ్యాపారులు తిరస్కరించడం గమనార్హం. వేలం కేంద్రానికి రైతులు 973 బేళ్లను తీసుకురాగా వాటిలో 716 బేళ్ల కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.280 కాగా, కనిష్ట ధర రూ.160, సరాసరి రూ.190.27 ధర పలికింది.

మధ్యాహ్న భోజనంలో తేడా వస్తే సస్పెండ్ చేస్తా!

- మెనూ అమలు చేయకపోవడంపై డీఈఓ ఆగ్రహం



వంట తయారీని పరిశీలిస్తున్న డీఈఓ

పొదిలి రూరల్: ప్రభుత్వం పాఠశాలలో అమలు చేసే మధ్యాహ్న భోజన పథకం అమలులో తేడా వస్తే సస్పెండ్ చేస్తానని ఉపాధ్యాయులపై డీఈఓ కిరణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పొదిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన అకస్మాత్తుగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో తయారు చేసే మధ్యాహ్న భోజనానికి వాడిన సరుకులను పరిశీలించారు. నూనె ప్యాకెట్‌పై ఎక్స్‌పెయిరీ డేట్ అయిపోయి ఉండటంతో అనుమానం వ్యక్తం చేస్తూ పూర్తి వివరాలు అడిగారు. ఎంత మంది విద్యార్థులు వచ్చారని అడగ్గా 50 మంది అని ఉపాధ్యాయులు సమాధానం చెప్పారు. రిజిస్టర్‌లో 71 మంది నమోదు చేయడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజనానికి ఎన్ని కేజీల బియ్యం వాడారని ప్రశ్నిస్తే 4 కేజీలు అని చెప్పడంతో మిమ్మల్ని సస్పెండ్ చేస్తే తెలుస్తుందన్నారు. అంతేగాక ఒకే పాఠశాల ఆవరణలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ స్కూల్, ఉర్దూ పాఠశాలలు ఉన్నాయి. అన్ని పాఠశాలలకు సంబంధించిన మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన వంట ఒకే చోట తయారు చేస్తూ ఉండటంతో మెనూ లో తేడాలు రావడానికి అవకాశం ఉందన్నారు. అన్ని పాఠశాలలకు భోజనం తయారు చేయడానికి ప్రభుత్వం గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నా ఇక్కడ వంట గ్యాస్‌తో కాకుండా కట్టెలతో ఎందుకు చేస్తున్నారో ఎంఈఓ వివరణ తీసుకుంటానని అన్నారు.

ఒంగోలు ట్రిపుల్ ఐటీ ప్రతిష్ట దిగజారుతోంది. ప్రశాంతంగా ఉన్న కళాశాల వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. కళాశాల ప్రారంభం రోజే క్యాంటీన్ నిర్వాహకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఆ వివాదం మరువకముందే విద్యార్థులు కొట్టుకున్నారు. దీనికి సంబంధించి 26 మంది సీనియర్ విద్యార్థులను సస్పెండ్ చేశారు. వెంటనే వారిని క్యాంపస్ నుంచి బలవంతంగా వెళ్లగొట్టడం సంచలనంగా మారింది. ఒక వైపు కళాశాల డైరెక్టర్ మెడికల్ లీవుపై వెళ్లడం, మరో వైపు ఫ్యాకల్టీల బదిలీల్లో వివాదాలతో కళాశాలను పట్టించుకునే వారే కరువవడంతో పరిస్థితులు అదుపు తప్పుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.



ఎస్ఎస్ఎన్ క్యాంపస్‌లోని ట్రిపుల్ ఐటీ కాలేజీ

ఒకే బ్లాకులో సీనియర్లు, జూనియర్లు

ట్రిపుల్ ఐటీ కాలేజీలో గొడవలు జరగడంపై చర్చ జరుగుతోంది. ఎస్ఎస్ఎన్ క్యాంపస్‌లో మొత్తం 8 బ్లాకులు ఉన్నాయి. వీటిని ఏ, బి, సీ, డీ, ఈ, ఎఫ్, జీ, హెచ్, ఐ, జే బ్లాకులుగా పిలుస్తుంటారు. వీటిలో ఏ, బీ, సీ, డీ బ్లాకుల్లో గరల్స్ హాస్టల్ ఉంది. ఈ, ఎఫ్, జీ బ్లాకుల్లో అకడమిక్ తరగతులు నిర్వహిస్తుంటారు. గోల్డెన్ బ్లాకులో పరిపాలనా శాఖ కార్యాలయం ఉంది. హెచ్, ఐ, జే బ్లాకుల్లో బాయ్స్ హాస్టల్ ఉంది. ఒక్కో బ్లాకులో ఒక్కో ఏడాది విద్యార్థులను ఉంచాలి. అయితే ఇందుకు భిన్నంగా ఐ బ్లాకులోని ఒక ఫ్లోర్‌లో సీనియర్లను, మరో ఫ్లోర్‌లో జూనియర్లను ఉంచారు. ఈ ఇద్దరినీ ఒకే బ్లాకులో ఉంచడమే ఈ గొడవలకు ప్రధాన కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గొడవల కేంద్రం.. వివాదాల సుడిగుండం!

- మసకబారుతున్న ట్రిపుల్ ఐటీ ప్రతిష్ట
- క్యాంపస్‌లో తరచుగా గొడవలు
- మొన్న క్యాంటిన్ నిర్వాహకుల మధ్య ఫైటింగ్
- నిన్న విద్యార్థుల మధ్య గ్రూప్ వార్
- హాస్టల్ గదుల్లో క్రికెట్ బ్యాట్లు, స్టంపులు, డంబెల్స్
- ఒకే బ్లాక్‌లో సీనియర్లు, జూనియర్లు
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు
- గత ఐదేళ్లూ ప్రశాంతంగా ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రశాంతంగా ఉన్న ఒంగోలు ట్రిపుల్ ఐటీ కాలేజీ వివాదాలమయంగా మారుతోంది. కూటమి ప్రభుత్వ హయాంలో రావ్ అండ్ నాయుడు క్యాంపస్ ఎత్తివేసినప్పటి నుంచి తరచూ ఏదో ఒక వివాదం చుట్టుముడుతూనే ఉంది. అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ గొడవలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. డైరక్టర్ సెలవు మీద వెళ్లడంతో పరిస్థితి మరింత దిగజారింది. ఈ ఏడాది కాలేజీ ప్రారంభమైన తొలిరోజే క్యాంటిన్ నిర్వాహకుల మధ్య ఘర్షణ జరిగింది. ఇరవై రోజులు కూడా గడిచాయో లేదో విద్యార్థులు కొట్టుకున్నారు. ఒకవైపు ఫ్యాకల్టీల బదిలీల్లో అక్రమాల వ్యవహారం సద్దుమణగలేదు. డైలీవేజెస్ సిబ్బందికి వేతనాలు ఇవ్వకుండానే ఇంటికి పంపించి వేయడంపై అసంతృప్తి రాజుకుంటోంది. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ట్రిపుల్ ఐటీ క్యాంపస్ పరువు రోడ్డున పడిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గురువారం రాత్రి సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య గొడవ జరగడం, వారిలో 26 మందిని సస్పెండ్ చేయడం చర్చనీయాంశంగా మారింది.

అధికారులకు ముందే తెలుసా...

వాస్తవానికి రావ్ అండ్ నాయుడు క్యాంపస్‌లో ఉన్నప్పుడే కొందరు విద్యార్థుల మధ్య మనస్పర్థలు ఏర్పడినట్లు తెలిసింది. వెంటనే అప్రమత్తమైన అధికారులు విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. అయితే రావ్ అండ్ నాయుడు క్యాంపస్‌ను ఎత్తి వేసి ఇంజినీరింగ్ విద్యార్థులను ఎస్ఎస్ఎన్ క్యాంపస్‌కు తరలించారు. విద్యార్థుల మధ్య గొడవలు జరిగే అవకాశం ఉందని తెలిసినప్పటికీ ఎలాంటి ముందస్తు జాగ్రత చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఒకే బ్లాకులో సీనియర్లను, జూనియర్లను ఉంచడం గొడవలకు కారణమైందన్న విమర్శలు వస్తున్నాయి.

జూనియర్ విద్యార్థికి గాయాలు ...

విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణలో ఒక జూనియర్ విద్యార్థిపై క్రికెట్ స్టంప్స్‌తో దాడిచేసినట్లు తెలిసింది. ఈ దాడిలో ఆ విద్యార్థికి తీవ్రమైన గాయాలైనట్లు సమాచారం. ప్రస్తుతం అతనిని వైద్యశాలలో రహస్యంగా ఉంచి చికిత్స చేయిస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై బాధిత విద్యార్థి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

హాస్టల్ గదుల్లో క్రికెట్ బ్యాట్లు

సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య జరిగిన గొడవల్లో క్రికెట్ బ్యాట్లు, స్టంపులు వినియోగించినట్టు సమాచారం. ఈ గొడవ తరువాత జరిగిన తనిఖీల్లో హాస్టల్ గదుల్లో పదుల సంఖ్యలో క్రికెట్ బ్యాట్లు, స్టంపులు, డంబెల్స్ దొరికినట్లు తెలిసింది. నిబంధనల ప్రకారం హాస్టల్ గదుల్లో ఎలాంటి క్రీడా పరికరాలు ఉండకూడదు. అసలు క్రికెట్ బ్యాట్లు, స్టంపులు, డంబెల్స్ విద్యార్థుల గదుల్లోకి ఎలా వచ్చాయో అధికారులే చెప్పాలి. నిజానికి క్యాంపస్‌లో పీఈటీ విభాగానికి సంబంధించిన గది ఉంది. తరగతులు అయిపోయాక క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులు తమకు నచ్చిన ఆటలు ఆడుకునే సౌకర్యం ఉంది. ఇక్కడ క్యారంబోర్డు, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, చెస్, క్రికెట్ పరికరాలు ఉంటాయి. వీటిని తీసుకెళ్లి ఆడుకొన్న తరువాత వాటిని పీఈటీకి అప్పగించాల్సి ఉంది. అలాంటిది విద్యార్థుల గదుల్లో ఈ క్రికెట్ బ్యాట్లు, స్టంప్స్ ఎలా వచ్చాయన్నది తెలియాల్సి ఉంది. వీటిని గుట్టుచప్పుడు కాకుండా ఏవో కార్యాలయానికి తరలించారు.



విద్యార్థుల గదుల నుంచి తరలించిన వాటిలో కొన్ని క్రికెట్ బ్యాట్లు, డంబెల్స్

విద్యార్థుల సస్పెన్షన్‌పై సీరియస్...

విద్యార్థుల మధ్య జరిగిన కొట్లాటలకు సంబంధించి 26 మంది సీనియర్ విద్యార్థులను అధికారులు సస్పెండ్ చేశారు. వెంటనే వారిని క్యాంపస్ నుంచి బలవంతంగా వెళ్లగొట్టారు. విద్యార్థులు ఎంతగా బతిమాలుకున్నా అధికారులు వినలేదని తెలుస్తోంది. ఇదిలా ఉండగా సస్పెండ్ అయిన విద్యార్థుల్లో పశ్చిమ ప్రకాశంలోని ఒక మండల విద్యాధికారి సోదరి కుమారుడు ఉన్నట్లు సమాచారం. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా తమ పిల్లవాడిని కాలేజీ నుంచి సస్పెండ్ చేసి ఇంటికి పంపించడంతో ఆగ్రహానికి గురైన ఆయన శనివారం ట్రిపుల్ ఐటీ అధికారులకు ఫోన్ చేసి వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది. గొడవ జరుగుతున్నప్పుడు బయట ఉన్న విద్యార్థిని ఎలా సస్పెండ్ చేస్తారని ప్రశ్నించినట్లుగా తెలిసింది. ఏ ప్రతిపాదిక మీద విద్యార్థులను సస్పెండ్ చేశారో చెప్పాలని నిలదీసినట్లు సమాచారం. ఈ ఘటనపై ఎలాంటి విచారణ నిర్వహించారు. ఏమని రిపోర్టు ఇచ్చారని అడిగినట్లు తెలుస్తోంది. కాలేజీలో రెండు గ్రూపుల మధ్య వివాదం జరిగితే ఒక గ్రూపు విద్యార్థులనే ఎలా సస్పెండ్ చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు చెబుతున్నారు. ఇదిలా ఉండగా పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఆగ్రహం వ్యక్తం చేయడంతో అధికారులు బెంబేలెత్తారు. సోమవారం కళాశాలకు రావాలని విద్యార్థులకు ఫోన్లు చేసినట్టు సమాచారం.

స్టూడెంట్స్ వెల్ఫేర్ అధికారుల వైఫల్యం...

విద్యార్థుల మధ్య గొడవ జరగడంలో స్టూడెంట్ వెల్ఫేర్ విభాగానికి చెందిన కొందరు అధికారుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. సీనియర్, జూనియర్ విద్యార్థులను ఒకే బ్లాక్‌లో ఉంచడం, విద్యార్థుల మధ్య గొడవలు జరిగే అవకాశం ఉందని తెలిసినా ఎలాంటి కౌన్సిలింగ్ నిర్వహించకపోవడం, విద్యార్థులు హాస్టల్ గదుల్లో క్రికెట్ బ్యాట్లు, స్టంప్స్, డంబెల్స్ దాచిపెట్టుకున్నప్పటికీ పసిగట్టలేకపోవడం ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. నిజానికి ఈ గొడవలకు సంబంధించి 26 మంది విద్యార్థులను సస్పెండ్ చేశారు అయితే గొడవలను అరికట్టలేని సంబంధిత అధికారులపై చర్యలు ఎలాంటి చర్యలు తీసుకుంటారో మరి.

బాబు అబద్ధాలకోరు

- వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ కారుమూరి



మాట్లాడుతున్న కారుమూరి నాగేశ్వరరావు, పక్కన తాటిపర్తి, వేదికపై శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ, శ్యామల, బత్తుల

యర్రగొండపాలెం: అబద్ధాలకోరు చంద్రబాబును నమ్మకండని, అమ్మ ఒడి పథకం తన అబ్బాయి పప్పు మస్తిష్కంలో నుంచి పుట్టుకొచ్చిందని పచ్చి అబద్ధాలు చెప్తున్నాడని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక వైష్ణవి గార్డెన్స్‌లో శనివారం నిర్వహించిన బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. కారుమూరి మాట్లాడుతూ ఎన్నికల ముందు కులం చూడను, మతం చూడను, పార్టీ చూడను నాకు ఓటు వేసిన వారికే నేను ముఖ్యమంత్రినని బాబు చెప్పాడని, అధికారంలోకి వచ్చాక వీళ్ల ఇంట్లో సొమ్ము ఇచ్చినట్లు వైఎస్సార్ సీపీ వాళ్లకు పనులు చేయవద్దని అంటున్నాడని అన్నారు. ఎన్నికలకంటే ముందు వాళ్ల కార్యకర్తలు వెళ్లి మీ ఓటీపీ చెప్పండి, మీకు బాండు ఇస్తున్నాము, సంవత్సరానికి రూ.1 లక్ష 4 వేలు వస్తుంది, 5 సంవత్సరాలకు రూ.5.20 లక్షలు వస్తుందని చెప్పిన ఆ పెద్దమనుషులు మోసం చేశారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ప్రతి గ్రామానికి వెళ్లి ఈ క్యూఆర్‌కోడ్‌ను ఆన్‌చేసి బాబు మోసాలను తెలియజేయాలన్నారు. ఈ పథకాలు ఇవ్వకపోయినా రూ.1.86 లక్షల కోట్లు అప్పు చేసి మనందరి నెత్తిమీద పెట్టాడని అన్నారు. ప్రజలకు పథకాల ద్వారా డబ్బులు ఇస్తే వారు తమ అవసరాలకు ఉపయోగించుకున్నారని, దీని వలన వ్యాపారాలు జరిగాయని వారు గ్రహించారన్నారు. ఈ విషయాలను వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామాలకు వెళ్లి వివరించాలని కోరారు.

మత గ్రంథాలపై ప్రమాణం చేసి చెప్పండి.. రాజకీయలకు దూరంగా ఉంటా

వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు తమ మేనిఫెస్టో ఒక ఖురాన్, ఒక బైబిల్, ఒక భగవద్గీత అని చెప్పాడని, మీకు దమ్ముంటే ఆ గ్రంథాలపై చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రమాణం చేసి తాము సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చామని చెప్తే తాను రాజకీయాలకు దూరమై పోతానని దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. 2014లో చంద్రబాబు ప్రజలకు మోసం చేశాడని, 2024లో మోసం చేశాడని, మళ్లీ 2029లో మోసం చేయాలని ఆయన ఉన్నాడని బూచేపల్లి అన్నారు. చంద్రబాబు మోసం చేయడంతో పాటు ప్రజలకు వెన్నుపోటు పొడిచే ప్రయత్నంలో ఉన్నాడని, కూటమిని నమ్మవద్దన్నారు. జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో ఉంటేనే బడుగు, బలహీన వర్గాలు, రైతులు, పేద వర్గాలకు చెందినవారు బాగుంటారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంటలకు గిట్టుబాటు ధరలేదన్నారు.

రెండెకరాల పొలంతో మొదలై.. రూ.2 లక్షల కోట్లకు ఎగబాకింది

తన స్వార్థం కోసం రాజకీయాలను ఉపయోగించుకుంటున్న చంద్రబాబు ఆస్తి రెండెకరాల పొలంతో మొదలై రూ.2 లక్షల కోట్లకు ఎగబాకిందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. ఇంత ఆస్తి ఏవిధంగా సంపాదించావని ఆయన ప్రశ్నించారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చి దోచుకోవడమే పనిగా పెట్టుకున్నాడని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న సంపదను కొల్లగొట్టేందుకు రాబందులను పెంచి పోషించాడని, ఇసుక, రేషన్, లిక్కర్, విద్య, వైద్యం అమ్ముకునేవారు జగన్‌మోహన్‌రెడ్డిపై కక్ష కట్టారన్నారు. ఈ మంచోడు అధికారంలో ఉంటే పేదవాళ్లను లక్షాధికారులను చేసేస్తాడని, తమ ఆగడాలను సాగనివ్వడని, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారి పిల్లలను విద్యావంతులుగా, సంపన్నులుగా చేసేస్తాడని దీనివలన తాము చేస్తున్న అక్రమ వ్యాపారాలన్నీ కుంటు పడిపోతాయని ఆలోచించి తప్పుడు ప్రచారం చేయడం ప్రారంభించారని అన్నారు. జగనన్న చేసిన మంచి పథకాలపై ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకొని తప్పుడు ప్రచారం చేశారని అన్నారు.

మోసపు వాగ్దానాలు చేసి..

రాష్ట్ర ప్రజలకు మోసపు మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన ఒక్క వాగ్దానాన్ని కూడా నెరవేర్చలేదని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. పశ్చిమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖరరెడ్డి జల యజ్ఞం కింద వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి నిధులు కేటాయించారని, ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆ ప్రాజెక్టు పనులు వేగవంతంచేసి పూర్తి చేశారని అన్నారు. అటువంటి ప్రాజెక్టును నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. వైఎస్ జగన్ నవరత్నాల పథకాలు అమలుచేసి కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా అమలుపరిచారని అన్నారు.

జగన్‌ను చూసి హడలిపోతున్నారు:

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని చూసి కూటమి నాయకులు హడలిపోతున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. ప్రతిపక్షనేతగా రాష్ట్ర ప్రజల కష్టాలను తీర్చటానికి ఆయన బయటికి వస్తుంటే అడుగడుగునా ఈ ప్రభుత్వం ఆంక్షలు విధిస్తోందని విమర్శించారు. పొగాకు రైతులను పరామర్శించటానికి పొదిలికి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా వేలాది మంది రైతులు పాల్గొన్నారని, తమ సమస్యలను చెప్పుకున్నారని అన్నారు. పొగాకుకు ధర పెంచమని అడిగిన రైతులను పోలీసులతో అరెస్టు చేయించి జైల్లో పెట్టించిన దుర్మార్గపు ప్రభుత్వం అని ఆమె విమర్శించారు.

పథకాల అమలులో మోసం గ్యారెంటీ

కూటమి నాయకులు ఎన్నికల ముందు తామిచ్చిన వాగ్దానాలు నెరవేర్చకుండా ప్రజలకు మోసం చేశారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు ఆరె శ్యామల, యనమల నాగార్జున యాదవ్ అన్నారు. ఎన్నికల ముందు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని విస్మరించడం చంద్రబాబుకు అనాదిగా వస్తున్న అలవాటని అన్నారు.



సభకు భారీగా హాజరైన నాయకులు, కార్యకర్తలు

ప్రజా ప్రతిఘటనతోనే హక్కుల సాధన


- హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి బి.చంద్రకుమార్



రాష్ట్ర సదస్సులో మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్, పక్కన రామకృష్ణ

ఒంగోలు టౌన్: దేశంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఆదివాసీ ప్రజలంతా ఐక్యమై ప్రతిఘటనా పోరాటాలు చేస్తేనే హక్కులు సాధించగలుగుతారని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి బి.చంద్రకుమార్ చెప్పారు. కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దుడ్డు ప్రభాకర్ తదితర ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలను విడుదల చేయాలని కోరుతూ ఒంగోలులోని అంబేడ్కర్ భవనంలో శనివారం ఏర్పాటు చేసిన రాష్ట్ర సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత ప్రజా స్వామిక హక్కుల కోసం దుడ్డు ప్రభాకర్ ప్రారంభించిన పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. కుల వివక్షకు వ్యతిరేకంగా, సమాజంలోని అంతరాలను ప్రశ్నించిన ఆయనపై క్రూరమైన చట్టాలను ప్రయోగించి అక్రమంగా అరెస్టు చేశారని చెప్పారు. నిజానికి ప్రజలకు రకరకాల హామీలిచ్చి అమలు చేయకుండా మోసం చేసిన నాయకులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దేశానికి నష్టం చేస్తున్నాడని, మతోన్మాద పాలన చేస్తున్నాడని మోదీపై విమర్శలు గుప్పించిన చంద్రబాబు అధికారం కోసం అదే మోదీతో అంటకాగుతున్నాడని విమర్శించారు. 2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని లేకుండా చేస్తానని హోంమంత్రి చెబుతున్నాడని, దేశంలో కోట్లాది మంది నిరుపేదలు ఉన్నారని, దరిద్రాన్ని లేకుండా చేస్తానని చెబితే బాగుంటుందని వ్యాఖ్యానించారు. దేశంలో అవినీతి లేకుండా చేస్తా, గంజాయి లేకుండా చేస్తా అని మాత్రం చెప్పలేదని ఎద్దేవా చేశారు. శాంతి చర్చల కమిటీ పిలుపు మేరకు మావోయిస్టులు కాల్పుల విరమణకు సిద్ధమని ప్రకటించారని, అందుకు బదులుగా వేలాది మంది సైన్యాన్ని పంపించి మావోయిస్టులను కాల్చి చంపడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఉపా చట్టాన్ని రద్దు చేయాలని, అక్రమ కేసులను వాపసు తీసుకోవాలని, దుడ్డు ప్రభాకర్ తదితరులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ అణగారిన వర్గాల్లో చైతన్యం నింపిన దుడ్డు ప్రభాకర్‌ను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం అన్నీ వ్యవస్థలను తన గుప్పిట్లో ఉంచుకొని ప్రజల గొంతు వినిపించే ప్రజా సంఘాల నాయకుల మీద అక్రమ కేసులు పెట్టి వేధిస్తోందని విమర్శించారు. ప్రజలు తిరగబడకముందే ఈ వైఖరి మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సుకు కేఎన్‌పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి దుడ్డు వెంకటరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణయ్య అధ్యక్షత వహించగా విరసం రాష్ట్ర నాయకులు కళ్యాణ్ రావు, వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శుల నియామకం



కేవీ రమణారెడ్డి



వై.వెంకటేశ్వరరావు



బొట్ల రామారావు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా కె.వి.రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు, బొట్ల రామారావులను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలను వీరికి కేటాయిస్తారని తెలిపారు. నియమితులైన వారు పార్టీ కేంద్ర కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ, సంబంధిత రీజినల్ కో–ఆర్డినేటర్లు, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులకు సహాయకారిగా వ్యవహరిస్తారని పార్టీ కార్యాలయం తెలిపింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, సోషల్ మీడియా స్పెషల్ టాస్క్ ఫోర్స్ రాష్ట్ర సభ్యునిగా కొనసాగుతున్న కేవీ రమణారెడ్డికి వాటితో పాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శి (పార్లమెంట్) ప్రకాశం జిల్లా అదనపు బాధ్యతలను అప్పగించారు. నూతనంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా (పార్లమెంట్) జిల్లాలోని గిద్దలూరు నియోజకవర్గానికి చెందిన వై వెంకటేశ్వరరావు, కొండపి నియోజకవర్గానికి చెందిన బొట్ల రామారావు లను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియామకానికి కారకులైన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, రీజినల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానంద రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు డాక్టర్ ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున, అన్నా రాంబాబు, కె.నాగార్జున రెడ్డి, చుండూరి రవిబాబు, దద్దాల నారాయణ యాదవ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకంతో ఈ పదవికి ఎంపిక చేసిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసే వరకు పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

క్లుప్తంగా

పొదిలి నుంచి గుంటూరుకు 8 సర్వీసులు

దర్శి: పొదిలి నుంచి గుంటూరు వెళ్లే ప్రయాణికులకు ఆర్టీసీ అదనపు బస్సులు తిప్పనుంది. ఈ నెల 21వ తేదీ నుంచి ఉదయం 5 గంటల నుంచి ప్రతి గంటన్నరకు పొదిలి నుంచి గుంటూరుకు సాయంత్రం 5.30 గంటల వరకు మొత్తం ఎనిమిది ట్రిప్పులు తిప్పనుంది. ప్రతి గంటన్నరకు గుంటూరు నుంచి ఉదయం 5 గంటల నుంచి రాత్రి 7.15 గంటల వరకు ఎక్స్ప్రెస్‌లు తిరుగుతాయన్నారు. దర్శిలో ఉదయం 5.30 గంటలకు, 7 గంటలకు, 8.30 గంటలకు, 10.30, ఒంటి గంటకు, 2.30, 4.00, 6.00 గంటలకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు తిప్పుతున్నట్లు పొదిలి ఆర్టీసీ డీఎం వి.శంకరరావు తెలిపారు. పొదిలి నుంచి వయా దర్శి, ముండ్లమూరు, అద్దంకి, రేణింగవరం బైపాస్ మీదుగా గుంటూరుకు, తిరిగి అదే రూటులో గుంటూరు నుంచి పొదిలికి ప్రతి రోజు 8 బస్సులు తిప్పనున్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

పర్యావరణ ప్రేమికుడి ప్రపంచ యాత్ర

● పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ సైకిల్‌పై తమిళనాడు యువకుడి ప్రచారం



సైకిల్ యాత్రలో భాగంగా తహశీల్దార్ కార్యాలయం వద్ద పర్యావరణ ప్రేమికుడు

గిద్దలూరు రూరల్: తమిళనాడుకు చెందిన ఓ పర్యావరణ ప్రేమికుడు సైకిల్ పై ప్రపంచ యాత్రకు శ్రీకారం చుట్టాడు. అందులో భాగంగా శనివారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని తహశీల్దార్ ఆంజనేయరెడ్డిని కలిశారు. తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన ముత్తుసెల్వన్ ఎంబీఏ చదివి ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. జనాభాకు తగినంత స్థాయిలో చెట్లు లేని కారణంగా ఆక్సిజన్ కొరత ఏర్పడింది. 2021 వ సంవత్సరం కోవిడ్ రెండో విడత సమయంలో తమిళనాడుతో పాటుగా ప్రపంచ వ్యాప్తంగా కూడా ఆక్సిజన్‌కు ప్రజలు ఇబ్బంది పడ్డారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు సైకిల్ యాత్ర చేయాలని ఆ సమయంలో నిర్ణయించుకున్న ముత్తు సెల్వన్ తాను చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రపంచ యాత్రకు బయలుదేరాడు. తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటుగా బంగ్లాదేశ్, నేపాల్‌లోని కొన్ని ప్రాంతాలను పర్యటిస్తూ అవగాహన కల్పించేందుకు సైకిల్ పై పర్యటిస్తున్నాడు. 11 లక్షల మొక్కలు నాటాలనే లక్ష్యంతో పర్యటిస్తున్నానని ముత్తుసెల్వన్ తెలిపారు. ఇప్పటి వరకు 8 లక్షల మొక్కలను పైగా నాటినట్లు చెప్పారు. సైకిల్ పర్యటనలో భాగంగా ఇప్పటి వరకు తెలుగు, కన్నడ, మళయాలం భాషలను నేర్చుకున్నానన్నారు. గిద్దలూరు నుంచి కొమరోలు మీదుగా కోనపల్లె రోడ్డు నుంచి పామూరుకు వెళ్లనున్నట్లు ఆయన చెప్పారు.

కూటమిది అరాచక, అవినీతి ప్రభుత్వం

● వైఎస్సార్ సీపీ కొండపి ఇన్చార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఆదిమూలపు సురేష్



క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

సింగరాయకొండ:

రాష్ట్రంలో కూటమిది అరాచక, అవినీతి ప్రభుత్వమని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆరోపించారు. మండల కేంద్రంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం మండల అధ్యక్షుడు మసనం వెంకట్రావు ఆధ్వర్యంలో జరిగిన మండల విస్తృత స్థాయి సమావేశం, బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ సురేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలోని పార్టీల నాయకులు అధికార యంత్రాంగాన్ని చెప్పు చేతల్లో పెట్టుకుని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడంతో పాటు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. రేషన్ బియ్యాన్ని పేదవానికి పంచకుండా ఖండాంతరాలు దాటిస్తున్నారని, ఇసుక దోచుకుంటున్నారని, నాశిరకంగా పనులు చేస్తూ దోచుకుంటున్నారని మండిపడ్డారు. అధికారులు అధికార పార్టీ నాయకులకు తొత్తులుగా మారి అవినీతికి సహకరిస్తున్నారన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దాడులు చేయడం, వారి కుటుంబ సభ్యులను వ్యక్తిత్వ హననం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో సమావేశం ఏర్పాటు చేసినా అక్రమ కేసులు బనాయిస్తున్నారని, మంత్రి స్వామి గ్రామాల్లో పర్యటనకు వచ్చినప్పుడు జగనన్న ఫ్లెక్సీలు పోలీసులు తొలగిస్తున్నారని మండిపడ్డారు. కొండపిలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించినప్పుడు దాదాపు రెండు వేల మంది కార్యకర్తలు రాకుండా పోలీసులు 8 చెక్‌పోస్టులు పెట్టి అడ్డుకునే ప్రయత్నం చేశారని, సెల్‌ఫోన్‌లు లాక్కున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో భూ ఆక్రమణలు ఎక్కువయ్యాయని, కొండపి మండలం పెట్లూరులో ఓ రైతు బొప్పాయి తోటను రఫా..రఫా..అని నరికేస్తే ఇంతవరకు కేసు నమోదు చేయలేదన్నారు. జగనన్న పర్యటనలు చేస్తే కేసులు పెడుతున్నారని, సింగయ్య మృతిపై ఫేక్ వీడియో సృష్టించి పార్టీ నాయకులు, కార్యకర్తలపై కేసులు బనాయించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని, లేని మద్యం కుంభకోణం కేసు సృష్టించి చెవిరెడ్డి భాస్కరరెడ్డిని జైలుకు పంపారని, మిధున్‌రెడ్డిని కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆరోపించారు.

మోసపూరిత హామీలతో ప్రజలకు కుచ్చుటోపీ

సార్వత్రిక ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీలు ఇవ్వడమేగాక ఒక అడుగు ముందుకేసి బాబు ష్యూరిటీ–భవిష్యత్తు గ్యారెంటీ అంటూ ఇంటింటికీ తమ ప్రభుత్వంలో ఆ కుటుంబం ఏ మేరకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతుందో బాండ్ల రూపంలో ఇచ్చారని, దీంతో ప్రజలు బాబు మాటలు నమ్మారని సురేష్ గుర్తు చేశారు. 2014లో లాగే ఈసారి కూడా బాబు ప్రజలను మోసం చేశాడని పేర్కొన్నారు. ఉచిత బస్సు కోసం మహిళలు ఎదురు చూస్తున్నారని, పథకాలన్నీ అమలు చేశామని చెప్పుకుంటున్నారని, ఎవరైనా పథకాలు అమలు చేయలేదంటే వారి నాలుక మందమని చంద్రబాబు అంటున్నాడని, నాలుక మందమో తోలు మందమో ప్రజలే తేలుస్తారని హెచ్చరించారు. జగనన్న 99 శాతం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలు అమలు చేశారని గుర్తు చేశారు. జగనన్న పిలుపు మేరకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలు, నాయకులు ఈ నెల 24వ తేదీ నుంచి ఆగష్టు 4వ తేదీ వరకు గ్రామస్థాయిలో ఇంటింటా ప్రచారం నిర్వహించి కూటమి అవినీతిని, మోసాన్ని తెలియజేయాలని సూచించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..

వైఎస్సార్ సీపీలో నిజమైన కార్యకర్తకు ఎప్పుడూ తాను అండగా ఉంటానని మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ భరోసా ఇచ్చారు. పార్టీ పదవులు రోటేషన్ పద్ధతిలో అందరికీ ఇస్తామని, ఎవరూ అసంతృప్తి చెందాల్సిన పనిలేదన్నారు. పార్టీలో శల్య రాజకీయాలను ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. జరుగుమల్లి, కొండపిలో పార్టీకి ద్రోహం చేసిన వారిపై అవిశ్వాస తీర్మానం పెడతానని, ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. నియోజకవర్గంలో మంత్రి స్వామి, మారిటైం బోర్డు చైర్మన్ సత్యకు మధ్య లుకలుకలు ఉన్నాయన్న ప్రచారం జరుగుతోందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి కొండపి గడ్డపై పార్టీ జెండా ఎగురవేయడంతో పాటు జగనన్నను ముఖ్యమంత్రిని చేయడమే మన లక్ష్యమన్నారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ పోస్టర్లను ఆవిష్కరించారు. పార్టీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్ రెడ్డి, ఎంపీపీ కట్టా శోభారాణి, రాష్ట్ర అనుబంధ విభాగాల నాయకులు రాపూరి ప్రభావతి, సుదర్శి వెంకట్రావు, నరేంద్రరెడ్డి, షేక్ మహ్మద్‌బాషా, చొప్పర వెంకన్న, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ సుల్తాన్, ఎస్టీ సెల్ సెక్రటరీ కట్టా ఆనందరావు, నియోజకవర్గ అనుబంధ విభాగాల నాయకులు యనమల మాధవి, దాసు శ్రీను, షేక్ సలీం, గాదంశెట్టి గుప్తా, దావులూరి ఆదాం, బింగినపల్లి సర్పంచ్ జెట్టి విజయలక్ష్మి, మండల అనుబంధ విభాగాల నాయకులు కోమిట్ల వెంకారెడ్డి, షేక్ సలీం, షేక్ కరీం పాల్గొన్నారు.

నేర రహిత సమాజం కోసం పాటుపడాలి

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి
● ఎస్పీ దామోదర్ ఆధ్వర్యంలో అర్ధ వార్షిక నేర సమీక్ష



మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్, పక్కన జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

ఒంగోలు టౌన్: నేర రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి చెప్పారు. నేరాల నియంత్రణలో పోలీసు, న్యాయ వ్యవస్థ మధ్య సమన్వయం అవసరమన్నారు. జిల్లాలోని పోలీసు, రెవెన్యూ, న్యాయ, రవాణా, విద్య, వైద్యాధికారుల సమక్షంలో శనివారం స్థానిక రైజ్ ఇంజినీరింగ్ కళాశాలలో అర్ధ వార్షిక నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి మాట్లాడుతూ నేరాలకు సంబంధించిన విచారణ వేగవంతంగా జరిగే విధంగా తగిన సాక్ష్యాలు సమర్పించాలని సూచించారు. న్యాయ విచారణలో సాక్ష్యాలే కీలకమన్నారు. పోలీసులు నమోదు చేస్తున్న కేసుల నాణ్యత, సమర్పించిన సాక్ష్యాల ఆధారంగానే న్యాయస్థానాలు తీర్పులు వెలువరిస్తాయని చెప్పారు. పెండింగ్ కేసుల పరిష్కారం కోసం పోలీసులు, కోర్టుల మధ్య సమన్వయ సమావేశాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు సకాలంలో న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని చెప్పారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణకు సంబంధించి ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. మహిళలు తమ సమస్యలను ధైర్యంగా చెప్పుకునే వాతావరణాన్ని కల్పించాలని, నేరం జరిగే అవకాశం ఉన్న ప్రదేశాల్లో శక్తి టీం బృందాలతో నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. మహిళలు, బాలికల అదృశ్యం కేసుల్లో సమగ్ర విచారణ జరిపి వారిని త్వరగా గుర్తించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని, పాఠశాలలు, కళాశాలల సమీపాల్లో మైనర్లను తప్పుదోవ పట్టించే కార్యకలాపాలను నియంత్రించాలని ఆదేశించారు. మైనర్లు వాహనాలు నడపకుండా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని, అవసరమైతే తలిదండ్రులకు, మైనర్లకు కౌన్సిలింగ్ ఇవ్వాలని చెప్పారు. పోలీసుల పట్ల ప్రజల్లో నమ్మకం పెరిగేలా వ్యవహరించాలని చెప్పారు. జిల్లాను నేరరహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు రెవెన్యూ, ఎక్సైజ్, రవాణా అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని ఆదేశించారు. గడిచిన ఆరు నెలల కాలంలో నమోదైన కేసులను సమీక్షించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను అడిగి తెలుసుకొని పోలీసు అధికారులకు తగిన సూచనలు చేశారు. అనంతరం ఎన్డీపీఎస్ కేసుల దర్యాప్తు సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై సందేహాలను న్యాయనిపుణులు నివృత్తి చేశారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీఎస్పీలు రాయపాటి శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, సాయి ఈశ్వర్ యశ్వంత్, రమణకుమార్, కె.శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వై.ప్రశాంతికుమారి, జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వసుంధర, స్పెషల్ పీపీ జి.శీనారెడ్డి, సబ్ రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు, జిల్లా జైలర్ అప్పలనాయుడు, ట్రాన్స్‌కో ఈఈ వీరయ్య, ఎన్‌హెచ్ ఏఐ పీడీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ గోపీనాయక్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

35 డ్రోన్ కెమెరాలతో నగరంపై నిఘా...

నేర సమీక్ష సమావేశం అనంతరం నగరంలో 35 డ్రోన్ కెమెరాలతో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేశారు. నగర పరిధిలోనే కాకుండా నగర శివారులో పాడుబడిన బంగ్లాలు, తోటలు, బహిరంగ ప్రదేశాలు, పార్కులలో ముందుగా గుర్తించిన ప్రాంతాలకు డ్రోన్ కెమెరాలను పంపించారు. ఈవ్‌టీజింగ్, చెయిన్ స్నాచింగ్, పేకాట, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచారు. బైక్ రైడింగ్, ఓవర్ స్పీడ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్‌లను గుర్తించేందుకు నిఘా ఏర్పాటు చేశారు.

సీజనల్ వ్యాధులతో చనిపోతే వైద్యులపై చర్యలు

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

మార్కాపురం: ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, సీజనల్ వ్యాధులతో ఎవరైనా చనిపోతే వైద్యులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. శనివారం సాయంత్రం మార్కాపురం పట్టణ శివార్లలోని శ్రీనివాస ఫంక్షన్ హాలులో డివిజన్, మండల స్థాయి అధికారులతో అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయి సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని, ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. పీఎం జన్మన్ పథకంలో భాగంగా గిరిజన ఆవాస గ్రామాల్లో అర్హులకు ఇళ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇళ్ల నిర్మాణాల విషయంలో అటవీశాఖ అధికారుల నుంచి ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఆయా శాఖల అధికారులను సంప్రదించాలని సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లు, హాస్టల్స్‌లో దోమల మందు స్ప్రే చేయించాలన్నారు. బడిఈడు పిల్లలందరూ కచ్చితంగా పాఠశాలల్లో ఉండేలా ఎంఈఓలు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే 1098 నంబరుకు ఫోన్ చేసేలా అవగాహన కల్పించాలన్నారు. వారికి వైద్య పరీక్షలు చేయించాలన్నారు. మార్కాపురం డివిజన్‌లో 4375 మంది వల్నరబుల్ పిల్లలు ఉన్నారని, వీరి అభివృద్ధి కోసం మార్గదర్శకులను గుర్తించి అనుసంధానం చేయాలన్నారు. తల్లికి వందనం డబ్బులు జమ కావడంలో ఈకేవైసీ సమస్యలుంటే వాటిని త్వరగా పరిష్కరించాలన్నారు. ఆధార్‌కార్డు లేని చిన్నారులకు కారణాలను గుర్తించి వారికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అవసరమైన వారికి డొమిసిల్ సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దని, ఈ విషయంలో ఇతర డివిజన్లతో పోల్చితే మార్కాపురం పురోగతి కొంత నెమ్మదిగా ఉందని, వేగవంతం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్లు సందీప్ కృపాకర్, నిషాకుమారి పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఐసీయూ వార్డు ప్రారంభం

స్థానిక జీజీహెచ్‌లో ఐసీయూ వార్డు, థైరాయిడ్ మిషన్లను మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో కలిసి ప్రారంభించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్రరావు, డాక్టర్ ఎం.రాంబాబు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్లంబర్, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: అసిస్టెంట్ ప్లంబర్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో నిరుద్యోగ యువకులకు ఈ నెల 28వ తేదీ నుంచి 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జె.రవితేజ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నాక్ ట్రైనింగ్ సెంటర్, స్కిల్ హబ్ ఒంగోలు వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ శిక్షణకు పదో తరగతి పాస్/ఫెయిల్, ఆపై విద్యార్హత ఉన్న వారు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఈ నెల 25వ తేదీలోపు నాక్ సెంటర్, స్కిల్ హబ్ సెంటర్ ఒంగోలులో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ఫొటోగ్రఫీలో కృష్ణమూర్తికి అమెరికా పురస్కారం



పురస్కారానికి ఎంపికైన కృష్ణమూర్తి తీసిన చిత్రం



అమెరికా పురస్కారాన్ని అందుకుంటున్న కృష్ణమూర్తి

మార్కాపురం: పట్టణానికి చెందిన పోలేబోయిన కృష్ణమూర్తికి ఫొటోగ్రఫీ రంగంలో అమెరికా పురస్కారం లభించింది. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగంలో నిర్వహిస్తున్న డిప్లమా ఇన్ ఫొటోగ్రఫీ కోర్సులో కృష్ణమూర్తి శిక్షణ పొందుతున్నాడు. ఇందులో భాగంగా ఈ ఏడాది మార్చిలో కృష్ణమూర్తి ఒడిశాలోని మారుమూల కొండల్లో నివశించే బోండా గిరిజనుల జీవన శైలిపై 12 చిత్రాలను అమెరికాలోని ఇమేజ్ కొలిగ్ సొసైటీకి పంపారు. ఆ సంస్థ ఏటా ప్రపంచ వ్యాప్తంగా వివిధ అంశాలపై ప్రతిభ చూపిన ఫొటోగ్రాఫర్లకు పురస్కారం అందచేస్తుంది. అందులో భాగంగా కృష్ణమూర్తి పంపిన చిత్రాలు ఎంపిక కావడంతో కృష్ణమూర్తికి అమెరికన్ పురస్కారాన్ని యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో వీసీ కె.గంగాధర్‌రావు, రెక్టార్ కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ సింహాచలం, జర్నలిజం హెడ్ జ్యోతిర్మయి బహూకరించి కృష్ణమూర్తిని అభినందించారు.

ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలి



క్లాత్ కవర్లను పరిశీలిస్తున్న కలెక్టర్, పక్కన మంత్రి డోలా

మార్కాపురం టౌన్: ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టి ప్రత్యామ్నాయ వినియోగంపై వ్యాపారులు, ప్రజలు దృష్టి పెట్టాలని మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. శనివారం పట్టణంలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కూరగాయల మార్కెట్‌ను పరిశీలించి అనంతరం గడియార స్తంభం సెంటరులో మానవహారంగా ఏర్పడి ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను వినియోగించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ఎక్కువ రికవరీ చేస్తూ, చురుకుగా వ్యవహరిస్తూ, మెరుగైన పనితీరు చూపిన అధికారులు, సిబ్బందికి ఆగస్టు 15న జరగనున్న స్వతంత్ర్య దిన వేడుకల్లో అవార్డు ఇస్తామన్నారు. శానిటేషన్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన సిబ్బందిని సన్మానించారు.

మార్కెట్లో ప్లాస్టిక్ కవర్లు మాయం

స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంత్రి డోలా, కలెక్టర్ తమీమ్ అన్సారియా వస్తున్నారన్న సమాచారంతో మున్సిపల్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది హడావుడిగా కూరగాయల మార్కెట్‌కు వెళ్లారు. శనివారం ఉదయంకల్లా ప్లాస్టిక్ కవర్లు షాపుల్లో ఉండకూడదని, కేవలం కర్ర సంచులు, జూట్ కవర్లు, 50 మైక్రాన్స్ కన్నా పైన ఉన్న కవర్లు మాత్రమే ఏర్పాటు చేయాలని ఆదేశించారు.